అభివృద్ధిని చూసి గెలిపించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మల్కాజిగిరి: మల్కాజిగిరిలో జరిగిన అభివృద్ధిని చూసి తనను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కస్తూరిబానగర్ కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018 కంటే ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ మల్కాజిగిరిలో అభివృద్ధి జరగలేదన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత నగరంలోనే అన్ని నియోజకవర్గాల కంటే ఎక్కువ నిధులు తీసుకొచ్చి పనులు పూర్తి చేశామన్నారు. ఆనంద్‌బాగ్ ఆర్‌యూబీ, మౌలాలి కమాన్‌తో పాటు ముంపు సమస్య తీరడానికి బాక్స్ డ్రైన్ నిర్మాణం లాంటి దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో ఉంటున్నానని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేద్దాం



గడప గడప ప్రచారంలో పోగుల నర్సింహరెడ్డి

బోడుప్పల్: కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేద్దామని బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహరెడ్డి పిలుపునిచ్చారు. 15వ డివిజన్ సూరజ్‌నగర్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన గడప గడప కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కార్పొరేటర్ కొత్త దుర్గమ్మగౌడ్, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు బొమ్మక్ రమేష్, కుర్రి శివశంకర్, నాయకులు హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బైక్ ర్యాలీ



పీర్జాదిగూడలో బైక్ ర్యాలీలో మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని శుక్రవారం మేడిపల్లిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్, మహేష్ గౌడ్ ముఖ్యఅతిథులుగా పాల్గొని పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌గౌడ్, వంగేటి ప్రభాకర్ రెడ్డి, వేముల మహేష్‌గౌడ్, ఎండీ మజార్, రామ్‌రెడ్డి, నాగేష్, ముదిగొండ రమేష్, రంజిత్‌రెడ్డి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యం

- ప్రభుత్వంపై వ్యతిరేకతే కాంగ్రెస్‌ను గెలిపిస్తుంది
- పోయింది లీడర్లే.. పార్టీ కేడర్ చెక్కుచెదరలేదు..
- ఇంటింటి ప్రచారంలో మందుముల పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఆరు సంక్షేమ పథకాలను గడప గడపకు వివరిస్తూ ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. దాదాపుగా నియోజకవర్గంలో అన్ని డివిజన్లలో తమదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తూ ప్రత్యర్థుల గుండెల్లో దడ పుట్టిస్తున్నారు. పోయింది కేవలం లీడర్లేనని, పార్టీ కేడర్ చెక్కు చెదరకుండా ఉందని మరోసారి గుర్తు చేశారు. ఉప్పల్ అభివృద్ధికి బీఆర్ఎస్ చేసింది ఏమీ లేదని, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని, ఒక్క చాన్స్ ఇవ్వాలంటూ ఇంటింటికీ వెళ్లి ఓటరును అభ్యర్థిస్తున్నారు. శుక్రవారం ఉప్పల్ ఓల్డ్ భరత్ నగర్, శాంతినగర్‌లలో డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బోరంపేట కృష్ణ, తెల్కల మోహన్‌రెడ్డి, ఈగ అంజయ్య, డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్, తుమ్మల దేవిరెడ్డి, బుసం రఘునాథ రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, రామకృష్ణ రేణుక, సోమ్ బాలమణి తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్ రెడ్డి గెలుపుకోసం ఓల్డ్ భరత్‌నగర్‌లో సతీమణి ప్రచారం

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గం ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్, అశోక్‌నగర్, మర్రిగూడ పలు కాలనీలలో ప్రచారం చేశారు. గెలిపిస్తే.. ఉప్పల్ రూపురేఖలు మార్చేస్తామన్నారు. ఉప్పల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం అన్నారు. కాంగ్రెస్ నేతలు నెమలి అనిల్‌కుమార్, బెల్లం శ్రీను, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

ఉప్పల్ నుంచి మొదటి రోజు రెండు నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న ధనరాజ్

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గం నుంచి తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఉప్పల్ ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన రెవు చిన్న ధనరాజ్ స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. రామ్‌నగర్ అంబర్‌నగర్ సికింద్రాబాద్‌కు చెందిన మంద మల్లేషం తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేశారు.

తొలిరోజు.. ఒకే ఒక్కరు

మల్కాజిగిరి: తొలి రోజు మల్కాజిగిరి అసెంబ్లీ స్థానానికి ఒకే ఒక్కరు నామినేషన్ దాఖలు చేశారు. అల్వాల్‌కు చెందిన జాజుల భాస్కర్ శ్రమజీవి పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేశారు. భాస్కర్ గతంలో పలుమార్లు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సైతం నానినేషన్ దాఖలు చేశారు. 2009 ఎన్నికల్లో 157 ఓట్లు, 2018 ఎన్నికల్లో 513 ఓట్లు పొందారు. రిటర్నింగ్ కార్యాలయం వద్ద బందోబస్తును డీసీపీ జానకి పరిశీలించారు.



శ్రమజీవి పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేసిన జాజుల భాస్కర్

సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాలు చామకూర ప్రీతిరెడ్డి

బోడుప్పల్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాలు చామకూర ప్రీతిరెడ్డి అన్నారు. బోడుప్పల్ బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి, మేయర్ సామల బుచ్చిరెడ్డితో కలిసి ఆమె డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఏదో ఒక సంక్షేమ పథకం పొందిన వారే ఉన్నారన్నారు. వారందరూ మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం పార్టీ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేస్తున్నారన్నారు. మహిళలకు కూడా కొన్ని బాధ్యతలు అప్పగించి వారి సేవలను పార్టీ కోసం వినియోగించుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, కార్పొరేటర్లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన గీతారెడ్డి

బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఆకుతోట గీతారెడ్డి శుక్రవారం ప్రీతిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, బుచ్చిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితురాలై చేరినట్లు వెల్లడించారు.

మంత్రి మల్లారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

మేడిపల్లి: తెలంగాణ ఏర్పడ్డాక ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, 13వ డివిజన్ కార్పొరేటర్ తూముకుట్ల ప్రసన్నలక్ష్మీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలో పలు కాలనీల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చామకూర మల్లారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ.. ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యానిఫెస్టో ప్రతులను ఇంటింటికీ అందిస్తూ బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, వార్డు కమిటీ సభ్యులు, మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న ఆకుతోట గీతారెడ్డి

పీర్జాదిగూడలో మహిళా సమ్మేళనం

పీర్జాదిగూడ నగర బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల ఆధ్వర్యంలో మొదటి డివిజన్‌లో శుక్రవారం జరిగిన మహిళా సమ్మేళనానికి ముఖ్యఅతిథులుగా మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, చామకూర ప్రీతిరెడ్డి పాల్గొని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్పొరేటర్ కొల్తూరి మహేష్, నాయకులు పప్పుల అంజిరెడ్డి, ఏనుగుల మనోరంజ్‌రెడ్డి, జావేద్ ఖాన్, వాణిశ్రీ, పారిజాత, లత, దివ్య, శిరీష, జయంతి, శారద తదితరులు పాల్గొన్నారు.

మర్రి రాజశేఖర్‌రెడ్డిని గెలించండి

అల్వాల్: కారు గుర్తుకు ఓటు వేసి కారు గుర్తుకు ఓటు వేసి మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబిత కిషోర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం డివిజన్ పరిధిలోని మారుతినగర్, అయోధ్య ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో ఆమె ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి మర్రి రాజశేఖర్ రెడ్డిని గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 4 నుంచి శిక్షణ

జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికలకు సంబంధించి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పీవోలు, ఏపీవోల, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లకు ఈ నెల 4, 5 తేదీల్లో ఎన్నికల శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎన్నికల శిక్షణకు అందరూ తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు. ఈ నెల 4, 5వ తేదీల్లో జరిగే ఎన్నికల శిక్షణలో 2,877మంది పీవోలు, 2,877మంది ఏపీవోలకు, 5,754మంది ఓపీఓలు, 520మంది మైక్రో పరిశీలకులు పాల్గొంటారని పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రిటర్నింగ్ ఆఫీసర్లు, డీఎల్ఎంటీలు, ఏఎల్ఎంటీలు, సెక్టోరియల్ ఆఫీసర్ల ద్వారా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని అధికారులకు జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీలో, మేడ్చల్ నియోజకవర్గం అధికారులకు బోగారంలోని హోలిమేరీ ఇంజనీరింగ్ కాలేజీలో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధికారులకు అల్వాల్లోని లయోలా కాలేజీలో, మల్కాజిగిరి నియోజకవర్గం అధికారులకు సైనిక్‌పురిలోని భవంత్ కాలేజీలో, ఉప్పల్ నియోజకవర్గం అధికారులకు రామంతాపూర్లోని జవహర్లాల్ నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీలో శిక్షణ ఉంటుందన్నారు. వీరికి నోడల్ అధికారులు దేవసహాయం, కేశూరామ్ శిక్షణ ఇస్తారని జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు. శిక్షణకు పీవోలు, ఏపీవోలు హాజరు కావాలని, లేనట్ల యితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తాం



సమస్యలపై వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

ఉప్పల్: వినియోగదారులకు ఎలాంటి సమస్యలు రాకుండా పని చేస్తున్నట్లు మేడ్చల్ జిల్లా ట్రాన్స్‌కో సీజీఎం సాయిబాబా అన్నారు. ఉప్పల్ ఎస్ఈ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన వినియోగదారుల సదస్సుకు స్పందన లభించింది. వినియోగదారులు కొన్ని సమస్యలను తెలపడంతో అక్కడికక్కడే పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. మరికొన్ని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఏ సమస్య ఉన్నా ఫిర్యాదు చేయాలని, వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. డీఈ సాయిప్రసాద్, ఏడీఈలు బాలకృష్ణ, దశరథ్, చక్రవర్తి, స్వప్న, సుధాకర్‌రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

ఆ రెండు పార్టీలు దోచుకొని.. దాచుకునేవే..

బీజేపీ అభ్యర్థి ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు కక్కిరేని చేతనహరీష్, బండారు శ్రీవాణితో కలిసి శుక్రవారం రామంతాపూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాల పార్కు, హబ్సిగూడలోని కాకతీయ, వీరరాజారెడ్డి పార్కుల్లో శుక్రవారం మార్నింగ్ వాకర్స్‌ను కలిసి బీజేపీకే ఓటు వేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దోచుకునే పార్టీలని, ప్రజల సంక్షేమాన్ని కోరే పార్టీ బీజేపీ అన్నారు.



విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



అల్వాల్/గౌతంనగర్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీఈ సుచేంద్రనాథ్ అన్నారు. శుక్రవారం లోతుకుంటలోని ఆర్‌పి నిలయంలో ఏడీఈ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోగదారుల సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీరామాచారి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

గౌతంనగర్‌లో..

గౌతంనగర్‌లోని సబ్‌స్టేషన్‌లో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించారు. వినియోగదారుల నుంచి పలు ఫిర్యాదులు సేకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏడీఈ యాదగిరి, ఏఈలు ఉమా, కేఎస్ స్వామి, దాస్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు నడుం బిగిదాం



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న జనరల్ మేనేజర్ కె.శ్రీనివాస్

మల్లాపూర్: అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని బెల్ జనరల్ మేనేజర్ కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం మల్లాపూర్ పారిశ్రామికవాడలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(నవరత్న డిఫెన్స్ ప్రభుత్వం రంగ సంస్థ) ఆధ్వర్యంలో నిఘా జాగృతి వారోత్సవాల సందర్భంగా అవినీతి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దాదాపు 3 కిలో మీటర్లు ర్యాలీ తీశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ అవినీతి నిర్మూలన ప్రజలందరి కృషితోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ రుతు బెకమ్, బెల్ సంస్థలు అధికారులు, కార్మికులు 300 మంది పాల్గొన్నారు.

ఏబీవీపీ ధర్నా

రామంతాపూర్: రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని వసతి గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుర్ర అఖిల్, లోకేష్, నవీన్, సిద్దు, విజయ్, అఖిల్, భాను పాల్గొన్నారు.

బీజేపీకి శివయాదవ్ రాజీనామా

బోడుప్పల్: బోడుప్పల్ భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షుడు మాడుగుల శివయాదవ్ శుక్రవారం ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. బోడుప్పల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులకు తన రాజీనామా పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. త్వరలో తన అనుచరులతో పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వెల్లడించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల అరెస్టు

ఉప్పల్: విజయనగరం నుంచి నగరానికి తీసుకువచ్చి గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన ఘటన హబ్సిగూడలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ చంద్రశేఖర్‌గౌడ్ తెలిపిన వివరాలు.. నాచారం కౌండిన్యనగర్ ప్రాంతానికి చెందిన కొల్లు రాధేశ్యాం మణికంఠ(20), సూర్యపేట కేసర్లా పహాడ్ ప్రాంతానికి చెందిన దుబ్బాక సాయికృష్ణ(19) విజయనగరం జిల్లా నుంచి గంజాయి తీసుకువచ్చి నాచారం వీరారెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన బూసారపు సంపత్(24)ద్వారా విక్రయిస్తుంటారు. శుక్రవారం హబ్సిగూడ చౌరస్తా వద్ద గంజాయిని సంపత్‌కు ఇచ్చేందుకు సాయికృష్ణ, మణికంఠ వేచి ఉన్నారు. పోలీసులు అక్కడ మాటు వేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆరు కిలోల గంజాయి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు.